## అట్టహాసంగా అనంత స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్-2026 క్రీడాపోటీలు

**-అండర్-14 పోటీలను ప్రారంభించిన ఎంఈఓ నాగరాజు**
**- క్రీడల్లో పాల్గొన్న ఒక పాఠశాల బదులు మరొక పాఠశాల విద్యార్థులు**
**- క్రీడాప్రాంగణంలో వాగ్వివాదం**



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, జూలై 13 ప్రభాతవార్త**

అట్టహాసంగా అనంత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026 క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026 క్రీడా పోటీల్లో భాగంగా తాడిపత్రి టౌను, తాడిపత్రి మండలం అండర్-14 జట్ల క్రీడాకారులకు కబడ్డీ పోటీలను స్థానిక అరవింద పాఠశాల క్రీడా మైదానంలో ఎంఈఓ నాగరాజు ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో తాడిపత్రి టౌను, తాడిపత్రి మండలానికి చెందిన దాదాపు 31 జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో బాలికలు 16 జట్లు ఉండగా బాలురు 15 జట్లు ఉన్నాయి. క్రీడల అభివృద్ధి క్రీడా సంస్కృతిని అభివృద్ధి చేసేందుకు పాఠశాల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు క్రీడా పోటీలను నిర్వహించడానికి నిశ్చయించారు, పాఠశాల స్థాయి నుండి క్రీడా పోటీలను నిర్వహించడం వలన ఎక్కువ మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కలుగుతుంది, క్రీడలు అభివృద్ధి చెందిన దేశాల్లో మొదటగా క్రీడా సంస్కృతిని అభివృద్ధి చేయడం వలన అంతర్జాతీయ పోటీల్లో సులభంగా పతకాలు సాధిస్తున్నాయన్నారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడా సంస్కృతిని అలవాటు చేయడం వలన భవిష్యత్తులో పతకాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ క్రీడా పోటీలు జిల్లా క్రీడా సంస్థ, డిఎస్ఏ, ఆర్డీటిలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. అయితే అరవింద పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నేషనల్ కాన్వెంట్ తరఫున పాఠశాలలో విద్యనభ్యసించకుండా ఉన్న వేరే పాఠశాల విద్యార్థులు ఆ పాఠశాల నుంచి ప్రాతినిథ్యం వహించారు.

**కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ఒక పాఠశాలలో చదువుతూ మరొక పాఠశాల విద్యార్థులు :**

పట్టణంలోని సంజీవ్‌నగర్‌లో ఉన్న శ్రీసాయిచైతన్య స్కూల్‌లో ఏడవ తరగతి వరకు మాత్రమే బోధించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని పదవ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఆ పాఠశాలకు చెందిన విద్యార్థులు నేషనల్ కాన్వెంట్ స్కూల్లో చదువుతున్నట్లు అటెండెన్స్ వేయించుకొని క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ విషయం స్థానిక మండల విద్యాధికారులకు తెలిసినా పట్టించుకోలేదు. శ్రీసాయిచైతన్య విద్యార్థులు పెద్దపొలమడ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నప్పుడు అక్కడ ఉన్న అంపైర్ నిర్ణయాన్ని శ్రీసాయిచైతన్య స్కూల్ కరెస్పాండెంట్ నరసింహ ప్రశ్నించడంతో దాదాపు గంటసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. తిరిగి రెండు జట్లకు కబడ్డీ పోటీ పెట్టి విజేతను నిర్ణయిస్తామని చెప్పిన కరెస్పాండెంట్ అభ్యంతరం తెలిపినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ప్రశ్నించిన అధికారులపైన వ్యాయామ ఉపాధ్యాయులపైన దురుసుగా ప్రవర్తించారని సమాచారం. ఒక పాఠశాల తరఫున మరొక పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం ఎంతవరకు సమంజసమని పోటీలలో పాల్గొన్న విద్యార్థినిలు ప్రశ్నిస్తున్నారు. ఆ విద్యా సంస్థ పైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని అర్హులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గూలూరు ఆంజనేయులు**

**తనకల్లు, జూలై 13 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న గూలూరు ఆంజనేయులు

కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆంజనేయులు పేర్కొన్నారు. తనకల్లు మండలం మరలపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో రైతు పరిస్థితిని చూస్తుంటే హృదయం కలచివేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో రైతు పేరు చెప్పి ఓట్లు అడిగిన ప్రభుత్వం, ఈరోజు రైతు కష్టాలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. రైతులకు 75 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా కేవలం ఇప్పటి వరకు 25 వేల క్వింటాళ్లు మాత్రమే అందించగలిగారంటే రైతులు పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో చెప్పక్కర్లేదన్నారు. ఎరువులు, సాగునీటి ఏర్పాట్లు, పంటకు మార్కెట్ భరోసా ఇవి అన్నీ సకాలంలో అందకపోతే రైతు ఎలా సాగు చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వల్ల భారీగా నష్టపోతున్న రైతుని సకాలంలో ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించే వరకు కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలియచేశారు.

## నివాళులు అర్పించిన ఎమ్మెల్యే జె.సి

**తాడిపత్రిఅర్బన్, జూలై 13 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన జె.సి ప్రధాన అనుచరుడు కిట్ట అనారోగ్యంతో హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని కిట్ట భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ఎమ్మెల్యే జె.సి భరోసా ఇచ్చారు.

## రైతుల అభివృద్ధికి అతియా తోడ్పాటు

**అతియా ఫార్మర్స్ కంపెనీ ఆధ్వర్యంలో వేరుశెనగ కాయలు పంపిణీ**

**గాండ్లపెంట జూలై 13 ప్రభాతవార్త**

రైతులు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు అతియా ఫార్మర్స్ కంపెనీ తోడ్పాటు అందిస్తున్నట్లు సిఈఓ వెంకటేష్ నాయక్ సిసిఓ బాలకృష్ణ రెడ్డి తెలిపారు. అతియా ఫార్మర్స్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత విత్తన వేరుశెనగ కాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఈఓ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 10 కె ఎఫ్ పి ఓ లలో బాగంగా ఎస్ ఎఫ్ ఏ సి సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా తమ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. అందులో భాగంగా రైతుల అభివృద్ధి సంక్షేమం దిశగా ముందుకు సాగేందుకు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు సబ్సిడీ కి అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షాదాబ్, సిఈఓ వెంకటేష్ నాయక్, సిసిఓ బాలకృష్ణ రెడ్డి, సంస్థ సిబ్బంది జయరాములు, రోజా,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**తాడిపత్రిఅర్బన్, జూలై 13 ప్రభాతవార్త**

సజ్జలదిన్నె గ్రామంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న బుడిగి రాముడు (50) అనే వ్యక్తి అప్పుల బాధతాళలేక గ్రామ శివారులో చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు

## కనీస వేతనం 26,000 ఇవ్వాలి



డిపిఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్,జూలై 13 ప్రభాతవార్త**

జిల్లాలోని పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, అదేవిధంగా స్వచ్ఛభారత్,కార్మికులందరికీ 10000 రూపాయలు చెల్లించాలని ప్రభుత్వం ఇచ్చిన జీవో అమలు చేయాలిబకాయి వేతనాలు, పిఎఫ్,ఈఎస్ఐ, అమలు చేయాలని, డిపివో నాగరాజు నాయుడు ను కలిసి వినతిపత్రం అందించిన సిఐటియు,గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూజిల్లావ్యాప్తంగాగ్రామపంచాయతీలలో, పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సిఐటియుగ్రామపంచాయతీ యూనియన్ ఆధ్వర్యంలో, జిల్లా డిపిఓ నాగరాజు నాయుడుని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ యూనియన్, జిల్లా గౌరవ అధ్యక్షులు గోపాల్,జిల్లా కార్యదర్శి శివప్రసాద్ వారు మాట్లాడుతూ, నిత్యం గ్రామాల్లో పంచాయతీకి సంబంధించిన అనేక పనులు నిర్వర్తిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు లేవని, ఉద్యోగ భద్రత లేదని, దశాబ్దాల తరబడి పనిచేసిన పర్మినెంట్ చేయకుండా, ప్రభుత్వాలు మారుతున్న వీరిని మాత్రం పట్టించుకోకుండా అన్యాయం చేశారని ఆవేదన చెందారు. అదే రకంగా స్వచ్ఛభారత్, కార్మికులందరికీ, ప్రభుత్వమే 6000 వేతనంతో పాటు, అదనంగా నాలుగు వేల రూపాయలు, వృత్తిపరమైన ఆరోగ్య భత్యం చెల్లించాలని జీవోలు ఇచ్చిందని వాటిని ఎక్కడా అమలు చేయడం లేదని అన్నారు. కార్మికులసంక్షేమానికి సంబంధించి పిఎఫ్,ఇఎస్ఐ, కచ్చితంగా కార్మికులకు అందించాలని కార్మిక చట్టాలు చెబుతున్న, ఏ పంచాయతీలో కూడా కార్మికులు వాటికి నోచుకోలేదనిమండిపడ్డారు.గ్రామపంచాయతీ కార్మికులందరికీ కనీస వేతనం 26,000 అమలు చేయాలని, ఐదో తారీకు లోపు వేతనాలు ఇవ్వాలని, బకాయి పడ్డ వేతనాలు, పిఎఫ్ ,ఈఎస్ఐ, చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, దశాబ్దాల తరబడి పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలని, కోరారు. స్పందించిన డిపిఓ నాగరాజు నాయుడు పీఎఫ్ కు సంబంధించి కమిటీ వేశామని,ఎన్నికలకు సంబంధించి సర్ ప్రోగ్రాం ఉండి చేయలేకపోయాము అయిపోయిన వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అదే రకంగా స్వచ్ఛభారత్ కార్మికులందరికి, వృత్తిపరమైన ఆరోగ్య భత్యం 4000.లు చెల్లించమని కిందిస్థాయి కార్యదర్శులకు సర్క్యులర్ పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్, గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్షులు మధు, జిల్లా కోశాధికారి నూర్ భాషా, జిల్లా ను పెద్దన్న పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న సర్ గడువు

**-త్వరితగతిన పూర్తి చేయండి : తహాశీల్దార్ సింధూ**

**యల్లనూరు, జూలై 13 ప్రభాతవార్త**



తహాశీల్దార్ సింధూ

యల్లనూరు మండలంలో ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా సర్ కార్యక్రమానికి మంగళవారంతో గడువు ముగియనుందని తహాశీల్దార్ సింధూ తెలిపారు. మండల వ్యాప్తంగా సర్ కార్యక్రమం ద్వారా మండలంలోని ప్రతి గ్రామంలోని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బిఎల్ఓల ద్వారా ఓటరు నమోదును పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు తహాశీల్దార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ త్వరితగతిన సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని బిఎల్ఓలకు సూచించారు. మండల వ్యాప్తంగా 93 శాతం పూర్తయిందన్నారు. అఖిలపక్ష నాయకులు ప్రజలు కూడా మిగిలిన ఓట్ల వివరాలను సత్వరమే అందజేసి బిఎల్ఓలకు సహకరించాలని తహాశీల్దార్ కోరారు. ముఖ్యంగా అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలు సర్ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని కోరారు. ఒక్కసారి ఓటర్ లిస్ట్ నుండి తొలగిస్తే మరల చేర్చడం చాలా కష్టమని కావున ప్రజలు తమ యొక్క ఓటర్ నమోదును చేయించుకోవాలని తహాశీల్దార్ సూచించారు.

## శివాలయంలో మాసశివరాత్రి వేడుకలు

**తాడిపత్రిఅర్బన్, జూలై 13 ప్రభాతవార్త**



పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి, ఆరుద్రనక్షత్రం సోమవారం రావడంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఉదయం అర్చకులు ఎం.యోగానందకుమార్ శర్మ, రామకృష్ణశర్మలు శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో పాటు బిల్వపత్రాలు, ఆపిల్‌పండ్లు, పంచముఖ వెండి కవచంతో ప్రత్యేక ంగా అలంకరించి మహామంగళహారతి నిర్వహించారు. అదేవిధంగా శ్రీపార్వతిదేవి అమ్మవారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, సహదేవశర్మ, శంతన్‌శర్మలు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత విశిష్టమైన పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, ఇఒ రామాంజనేయులు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్కా బీటర్ అరెస్ట్

**- రూ.1,29,250 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం**

**పుట్లూరు, జూలై 13 ప్రభాతవార్త**



మండలంలోని అరకటివేముల గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న పొత్తూరు వెంకటనారాయణ అనే మట్కా బీటర్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. జిల్లా ఎస్పి జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డిఎస్పి టి.శ్రీనివాసులు పర్యవేక్షణలో పుట్లూరు సిఐ పి.సత్యబాబు సూచనల మేరకు పుట్లూరు మండలంలో మట్కాను అరికట్టడంలో భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అరకటివేముల గ్రామంలో మట్కా నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్ఐ సురేంద్రబాబు సిబ్బందితో కలిసి దాడులు జరిపి మట్కా నిర్వహిస్తున్న పొత్తూరు వెంకటనారాయణను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 1,29,250 రూపాయల నగదుతో పాటు సెల్‌ఫోన్, మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌బి ఎస్ఐ ఎం.కె.ప్రవీణ్‌కుమార్, పుట్లూరు సిబ్బంది రాము, నరేష్, శంకర్, మహేష్, ఎస్‌బి పిసి ధానంజినేయులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**- బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి**



ఆర్డిఓతో మాట్లాడుతున్న బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి

**కదిరి, జులై 13 ప్రభాతవార్త**

మున్సిపల్ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘానికి కేటాయించిన స్థలాలలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులతో కలిసి స్థానిక ఆర్డిఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల స్థలాల వ్యవహారంలో జరిగిన అక్రమాలపై సుమారు 500 మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆరోపించారు. అంతే కాకుండా మృతి చెందిన సుమారు 40 కార్మికుల కుటుంబాలకు సంబంధించి పట్టాలను కొందరు దళారులు కబ్జా చేశారని విమర్శించారు. గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు తేలినప్పటికీ కొందరు నేతల రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఇప్పటి వరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ పట్టాలు సృష్టించిన వారు, దళారులు, అక్రమాలకు సహకరించిన అధికారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డిఓ కళావతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, బాబు, బాషా, నరసింహులు, బిజెపి నాయకులు ఉత్తం రెడ్డి, బూదిలి సుదర్శన్, రామచంద్రారెడ్డి, డిఎల్ ఆంజినేయులు, ఇంతియాజ్, నంది శెట్టి బాబు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు వెంటనే నాణ్యమైన వేరుశనగ కాయలు, ఎరువులు పంపిణీ చేయాలి

**- పిసిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజినేయులు**

**కదిరి, జులై 13 ప్రభాతవార్త**



ఆంజినేయులు

ప్రభుత్వం రైతులకు సబ్సిడితో పంపిణీ చేసే వేరుశనగ విత్తన కాయలు వెంటనే పంపిణీ చేయాలని పిసిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరొకొరగా పడిన వర్షాలకు రైతులు తమ పొలాలను దుక్కి దున్ని చేసుకున్నారని ఇప్పటి వరకు కొన్ని ప్రాంతాలకు మాత్రమే విత్తన కాయలు పంపిణీ చేశారన్నారు. సత్యసాయి జిల్లాకు 75వేల క్వింటాళ్లు అవసరం కాగా కేవలం 25వేల క్వింటాళ్లు మాత్రమే పంపిణీ చేశారంటే ప్రభుత్వానికి రైతులపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తక్షణమే అందించాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## శ్రీవారి హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న భక్తులు

**కదిరి, జులై 13 ప్రభాతవార్త**

పట్టణంలోని ప్రముఖ ప్రసిద్ధి గాంచిన శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం ఆలయంలో నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపులో మొత్తం నగదు 1,07,23,498 యాభై ఏడు రోజులకుగాను వచ్చిందని విదేశీ కరెన్సీ యుఎస్ఏ 2 డాలర్లు, అరబ్ రెండు దీరం, మలేషియా 1 రూపి, రక్కీ ఫైలిరిస్, ఇండోనేషియా 200 సర్ రూపాయలు, బంగారం 7 గ్రాములు, వెండి 432 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి ప్రసాద్, ఆలయ సిబ్బంది, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, వివిధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## కురువ సంఘం నాయకులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

**- మండల కురువ సంఘం కన్వీనర్ పొట్టేరి రమేష్**

**అమడగూరు, జూలై 13 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఉండే కురువ సంఘం నాయకులు, సభ్యులు సమాజంలో రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కురువ సంఘం మండల కన్వీనర్ పొట్టేరి రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుండువారిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురువ సామాజిక వర్గానికి చెందిన యువతీ యువకులకు ఉన్నత విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా చేయడంలో సంఘానికి అందరూ కలిసిమెలిసి ముందుండాలన్నారు. ప్రభుత్వం అందించే వివిధ బిసి సంక్షేమ పథకాలు, రుణాలు సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. గొర్రెల పెంపకం, కంబళ్ల నేత వంటి సాంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం కోసం మనమందరం ప్రభుత్వానికి రాజకీయ నాయకులకు తెలియజేయాలని అప్పుడే మన కుటుంబ స్థితిగతులు వారికి తెలుస్తాయన్నారు. ఎవరికివారు తమ గృహాలకు పరిమితమైతే మనల్ని పట్టించుకునే నాథుడు ఎవరు ఉండరని కులాలు సంఘాలు ఏర్పాటు చేసుకొని ప్రస్తుత ప్రభుత్వాల్లో ఎంతోమంది లబ్ధి పొందుతున్నారని మన కులస్తులు అందరూ ఏకతాటిపై నడుచుకుంటూ ఒకే మాటపై నిలబడి మన సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కులస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కురువ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## గంగమ్మ దేవతకు పూజలు

**నంబూలపూలకుంట, జూలై 13 ప్రభాతవార్త**

వరుణ దేవుడు కరుణించి భారీ వర్షాలు కురిసి చెరువులు నీటితో కలకలలాడి ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పి.కొత్తపల్లి గ్రామస్తులు అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గంగమ్మ దేవతల ఆలయాల్లో పూజలు నిర్వహిస్తూ వర్షం కురవాలని పి.కొత్తపల్లి గ్రామ పంచాయతీ మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

## మండల అధికారులు తూతూ మంత్రంగా విధి నిర్వహణ

**నంబులపూలకుంట, జూలై 12 ప్రభాతవార్త**

మా మండలంలో పని చేస్తున్న అధికారులు కొందరు విధి నిర్వహణను తూతూ మంత్రంగా నిర్వహిస్తూ పనులను పెండింగ్ పెడుతూ.. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని మండల వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతోపాటు ఇంకా కొందరు ఎప్పుడైనా రావచ్చు.. ఎప్పుడైనా వెళ్లొచ్చు.. అన్నట్లుగా వ్యవహరిస్తూ సమస్యలపై వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొందరు అధికారులు అయితే చుక్కల్లో చంద్రుడు లాగా వచ్చి మెరిసి వెళ్లిపోతుంటాడు. అతడు వచ్చాడని ప్రజలకు, లబ్దిదారులకు తెలిసి ఆకార్యాలయం వద్దకు వెళ్లగానే ఎప్పుడు వెళ్లి ఉంటాడో తెలియకుండానే వెళ్లిపోయి ఉంటాడు. కొందరు ఉదయం వచ్చి హడావిడి చేసి మధ్యాహ్నం మాయమై అవుతారని అర్జీలను తీసుకెళ్లిన లబ్దిదారులకు అవిలేవు.. ఇవి లేవు అని చెప్పి వెళ్తే మళ్లీ కనిపించేది మరుసటి రోజే, ఆ రోజు కూడా సర్వర్ బిజీ అనడమో, ఫీల్డ్ వర్క్ వుంది అనడమో, మీటింగ్ ఉంది అనడమో ఏదో ఒకటి చెప్పి ప్రజల సమస్యకు పరిష్కారం చూపకుండానే ప్రజలను తిరిగి పంపిస్తుంటాడని ప్రజలు, లబ్దిదారులు అంటున్నారు. కొంచెం గట్టిగా అడిగితే మీ లాంటి వాళ్లకు సమాధానం చెప్పలేక పోతున్నామని, అధికారులపై దురుసుగా మాట్లాడుతున్నా డంటున్నారు. అందుకే మా సమస్యలు పరిష్కారం కాకనే వెను తిరగాల్సి వస్తోందని లబ్దిదారులు అంటున్నారు. ఇంకొక అధికారి అయితే తమ సిబ్బందితో కబుర్లతో కొద్ది సేపు కాలక్షేపం.. మరో కొద్ది సేపు సెల్‌తో కాలక్షేపం.. చేసి కరెక్ట్ టైం పాటించే వ్యక్తిలాగా వెళతాడు. ఇలా అధికారులు ఉంటే వారి యొక్క సేవలు ప్రజలకి ఎలా అందుతాయి. ఇకనైనా ప్రజా ప్రతినిధులు ఉన్నత అధికారులు స్పందించి వారి యొక్క సమయపాలన పాటించి ఆ సమయంలో ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

## కురుకుంట పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తా

**- కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరెడ్డి**

**అనంతపురం రూరల్, జులై 13 ప్రభాతవార్త**



మల్లికార్జునరెడ్డి

అనంత రూరల్ మండలం కురుకుంట పంచాయితీని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనలు సలహాలను పాటిస్తూ ఎంపిటిసి,అదే విదంగా స్థానిక టిడిపి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్మికులను సమన్వయం చేసుకుని పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తానని పంచాయితీ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్ 3 కార్యదర్శులకు గ్రేడ్ 2 కార్యదర్శులుగా పదోన్నతి కలిపించడం తోమల్లికార్జున రెడ్డికోరపాడు పంచాయితీలో గ్రేడ్ 3 కార్యదర్శిగా పనిచేస్తు గ్రేడ్ 2 కార్యదర్శి గాపదోన్నతిపొందండముతో అయనను కురుకుంట పంచాయితీ కార్యదర్శిగా మల్లికార్జున రెడ్డిని డి పి వో నాగరాజు నాయుడు నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడంతో ఆయన ఉత్తర్వుల మేరకు సోమవారం మల్లికార్జున రెడ్డి కురుకుంట పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున రెడ్డి కి పంచాయతీ సిబ్బంది శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డిమాట్లాడుతూ కురుకుంట పంచాయితీని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనలు సలహాలను పాటిస్తూ గ్రామ ఎంపిటిసి, టిడిపి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది. పంచాయితీ కార్మికులను సమన్వయం చేసుకుని పంచాయితీ అభివృద్ధికి కృషి చేస్తానన్ని తెలియజేశారు. అదే విదంగా ప్రభుత్వం నిద్దేశించిన సర్వేలు ఏవే గాని పెండింగ్ ఉండకుండా సకాలంలో పూర్తిచేసే విదంగా చర్యలు తీసుకుంటన్నారు.

## చెట్టును ఢీ కొన్న కారు

**- తీవ్రంగా గాయపడిన డ్రైవర్ మృతి**



చెట్టును ఢీ కొనడంతో దెబ్బతిన్న కారు

**పుట్లూరు, జులై 13 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం ఏ.కొండాపురం గ్రామంలోని అమ్మలదిన్నె రోడ్డులో సోమవారం కారు చెట్టును ఢీ కొన్న సంఘటనలో డ్రైవర్ నిరంజన్ (20) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పుట్లూరు మండలం అరకటవేముల గ్రామానికి చెందిన నిరంజన్ కారులో వెళుతూ ప్రమాదవశాత్తు చెట్టును ఢీ కొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన నిరంజన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతివేగమే ప్రమాదానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు.

చౌడేశ్వరి దేవి అమ్మవారి

## ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం



ఆలయ కమిటీ విరాళాలు అందజేస్తున్న చౌడపు ఈశ్వరయ్య

**నల్లచెరువు జూన్: 13, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని వివర్స్ కాలానికి చెందిన చౌడపు చౌడప్ప కుమారుడు చౌడపు ఈశ్వరయ్య నల్లచెరువు మండల కేంద్రం లోని నూతనంగా నిర్మించబడుతున్న జెండా వేపమాను సమీపంలో నిర్మిస్తున్న శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ అభివృద్ధి నిర్మాణానికి తన వంతు సాయంగా రూ 10016/- లను ఆలయ కమిటి సభ్యులకు సోమవారం అందించారు.ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ చౌడేశ్వరి అమ్మ వారి ఆలయ అభివృద్ధికి చౌడపు ఈశ్వరయ్య ఆర్థిక చేయడం సంతోషమని ఇలాగే దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధి తోడ్పాటు అవ్వాలని ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

## అనారోగ్యంతో వైసిపి సీనియర్ మైనార్టీ నాయకుడు మృతి

**నల్లచెరువు జూన్ 13 ప్రభాతవార్త,**



పఠాన్ హైదర్ వలీ ఖాన్ (ఫైల్ ఫోటో)

మండల పరిధిలోని తలమర్లవానపల్లి గ్రామపంచాయతీ లోని ఉప్పార్లపల్లికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ మైనార్టీ నాయకుడు పఠాన్ ఖాదర్ వలీ ఖాన్ (హాజీ) 78 ,సోమవారం అనారోగ్యంతో స్వగ్రామం లో పుప్పాలపల్లిలో మృతి చెందాడు విషయం తెలుసుకున్న కదిరి వైఎస్ఆర్సిపి నాయకులు హైదరవలి ఖాన్ పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

06ATP13.qxd:06ATP13.qxd 14/07/26 12:08 AM Page 1



## చిన్నముష్టూరు, పాల్తూరు గ్రామాల్లో పశుగ్రామ వారోత్సవాలు

-పాడి రైతులకు అవగాహన కల్పించిన పశుసంవర్ధకశాఖ ఏడీలు



చిన్నముష్టూరులో సాగులో ఉన్న పశుగ్రాసంవద్ద ఏడీ డాక్టర్ పి.పెద్దన్న, ఎఫ్ఎఫ్‌డీవో ఏడీ డాక్టర్ యం.రాధిక

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నముష్టూరు, విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామాల్లో సోమవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగ్రాసంవద్ద ఏడీ డాక్టర్ పి.పెద్దన్న, ఎఫ్ఎఫ్‌డీవో ఏడీ డాక్టర్ యం.రాధిక మాట్లాడుతూ పాడి రైతులు పశుగ్రాసం సాగుపై దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం కనుక పచ్చిమేత పంటలు వేసుకోవాలని, దీనివల్ల పాడి పశువుల నుండి అధిక పాల ఉత్పత్తి జరిగి లాభాలు పొందవచ్చన్నారు. నేపియర్, జొన్న, మొక్కజొన్న, గినియా గడ్డి సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెట్టం రాంబాబు, పశుసంవర్ధకశాఖ పారా సిబ్బంది, ఏహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.

## 16న ఎక్సైజ్ కేసులో జప్తు చేసిన సుమో వాహనం వేలం

-ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

ఎక్సైజ్ కేసులో పట్టుబడి ప్రభుత్వానికి జప్తు కాబడిన టాటా సుమో వాహనాన్ని ఈనెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు. ఉరవకొండ ఎక్సైజ్‌స్టేషన్‌వద్ద జరిగేవేలంలో పాల్గొనదలచిన వారు 3,000 రూపాయలు దరావతు చెల్లించాల్సి ఉంటుందని తమ ఆధార్, పాన్‌కార్డుల జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు.

## మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయి

-జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పి.జనార్ధననాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ పి.జనార్ధననాయుడు

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల అలవాటు జీవితాలను నాశనం చేస్తాయని ఉరవకొండ ఎస్ఐ పి.జనార్ధననాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.క్రిష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా



హాజరైన విద్యార్థులు

ఎస్ఐ పి.జనార్ధననాయుడు మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లలను గౌరవిస్తూ వారిపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వారి రక్షణకు ఎన్నో చట్టాలు అమలులో ఉన్నాయని ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, క్షణికావేశంలో నేరాలు చేసినా జీవితాలను నాశనం చేసుకొని బంగారు భవిష్యత్తును కోల్పోవాల్సి వస్తుందన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించి రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా పోక్సో యాక్ట్, డయల్ 100, శక్తి యాప్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ సీనియర్ అధ్యాపకులు కె.వి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్షత, బాల్య వివాహాలు సామాజిక దురాచారాలు

-డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యు.వెంకటరమణ

-షేక్షానుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యు.వెంకటరమణ

లింగ వివక్షత, బాల్య వివాహాలు సామాజిక దురాచారాలని వీటిని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యు.వెంకటరమణ అన్నారు. పెద్దకౌకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఓ.సారిక పర్యవేక్షణలో సోమవారం మండల పరిధిలోని షేక్షానుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యు.వెంకటరమణ మాట్లాడుతూ మగ పిల్లవాడే వారసుడు, వంశోద్ధారకుడు అనే మూఢ నమ్మకాలు, అపోహలతో ఆడబిడ్డలను తల్లి గర్భంలోనే హతమార్చుతున్నారని దీని కారణంగా సమాజంలో నానాటికీ స్త్రీల నిష్పత్తి తగ్గిపోతోందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించినా, ప్రోత్సహించిన వారందరూ గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం-1994 (పీసీపీఎన్‌డీటీ చట్టం) కింద శిక్షార్హులవుతారన్నారు. యుక్త వయసులో ఆకర్షణలు, బాల్య వివాహాలు చేసుకోవడం, చిన్నవయసులోనే గర్భం దాల్చడంవల్ల ఎన్నోరకాల అనారోగ్య, కుటుంబ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలు అనాగరికం, చట్టరీత్యా నేరమన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంవల్ల రోగాలు దరిచేరవని, దోమల ఉత్పత్తిని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు జి.మురళీకృష్ణ, కె.ఎర్రిస్వామి, ఎ.అలీమా, ఆరోగ్య సహాయకుడు ఎం.ప్రసాదరావు, ఎంఎల్‌హెచ్‌పీ చందన, ఆశ కార్యకర్త సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జీవితం ఎంతో విలువైంది.. ఆత్మహత్యలు పరిష్కారం కాదు

-అవగాహన కార్యక్రమంలో సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త



విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి

జీవితం ఎంతో విలువైందని సమస్యలు వస్తుంటాయి, పోతుంటాయని వారి ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలిగాని ఆత్మహత్యలు చేసుకోవడం సరైంది కాదని ఐసీడీఎస్ ఉరవకొండ ప్రాజెక్టు సీడీపీవో, జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ డా॥బి.ఎన్.శ్రీదేవి అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం 'నో సూసైడ్' అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥బి.ఎన్.శ్రీదేవి మాట్లాడుతూ కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడులు, విద్య, ఉపాధి సంబంధిత సమస్యలు, సామాజిక కారణాలు, శిరాశ, ఒంటరితనం లాంటి సమస్యలకు భయపడకుండా, బాధపడకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, నిపుణులు, సంబంధిత ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. మహిళల హెల్ప్‌లైన్ 181, ఛైల్డ్ హెల్ప్‌లైన్ 1098, తెలి మానస్ మానసిక ఆరోగ్యం హెల్ప్‌లైన్ 14416లను వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రాజేశ్వరి, 1,2 సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నసీమ తదితరులు పాల్గొన్నారు.

## రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న జ్యోతి పాఠశాలపై చర్యలు తీసుకోండి

-ఎంఈవోకు విన్నవించిన పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.హిరణ్య



ఎంఈవో హెచ్.ఈశ్వరప్పకు వినతిపత్రం అందిస్తున్న పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.హిరణ్య

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని ఈద్గాకు ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న జ్యోతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో హెచ్.ఈశ్వరప్పకు పీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.హిరణ్య కోరారు. ఈ మేరకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.హిరణ్య మాట్లాడుతూ రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్న కారణంగా విద్యార్థులు ఉక్కపోతలతో ఇబ్బందులు పడుతూ వస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు.

## లత్తవరం, తండాలో 'సర్' ఇంటింటి సర్వే విజయవంతం

- బీఎల్‌వోలు, బీఎల్‌ఏలను సన్మానించిన మాజీ సర్పంచ్



బీఎల్‌వోలు, బీఎల్‌ఏలను సన్మానించిన మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

మండల పరిధిలోని లత్తవరం, లత్తవరం తండా గ్రామాల్లో సర్-2026 ఇంటింటి సర్వే ప్రక్రియ విజయవంతం అయిందని తెలిసింది. బీఎల్‌వోలు బీఎల్‌ఏల సహకారంతో 155 పీఎస్‌లో (96.59శాతం), 156 పీఎస్‌లో (96.26శాతం), 157 పీఎస్‌ల పరిధిలో మొత్తం 491 మంది ఓటర్లలో 459 మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించి పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి సేకరించి బీఎల్‌వోల యాప్‌లో వాటిని డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప స్థానిక సచివాలయంలో బీఎల్‌వోలు ఎం.లిఖిత, వి.రాజేశ్వరి, సంతోష్‌బాబులతోపాటు టీడీపీ పార్టీ బీఎల్‌ఏలు ఇ.రాహుల్, డి.నందకిషోర్, సుంకన్నలను శాలువాలుకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అట్రాసిటీ యాక్ట్‌పై పల్లె నిద్రల ద్వారా అవగాహన కల్పించాలి

-సీఐ బి.మహానందికు ఎంఆర్‌పీఎస్ నాయకుల వినతి



సీఐ బి.మహానందికు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

దళితులపై ఇటీవలి కాలంలో దాడులు, దౌర్జన్యాలు అధికమయ్యాయని దాడులను నియంత్రించడానికి పకడ్బందీ చర్యలు చేపడుతూ గ్రామాల్లో పల్లె నిద్రల ద్వారా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి అవగాహన కల్పించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ నాయకులు సోమవారం సీఐ బి.మహానందికు వినతిపత్రం అందించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐను కలిసి వివిధ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఇటీవలి మోహరం సందర్భంగా జిల్లాలో పలుచోట్ల దళితులపై దాడులు, దూషణలు జరిగాయన్నారు. ఎస్సీ కాలనీల్లో పల్లె నిద్రలు నిర్వహించి అవగాహన కల్పించడంతోపాటు అన్ని, కులాలు, మతాల పెద్దలతో సమావేశాలు నిర్వహించి సంయమనం పాటించేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజు, మాజీ వార్డు సభ్యుడు ఎం.పెద్దన్న, నాయకులు హెచ్.బసవరాజు, బి.వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## మారెమ్మ గుడికి సుబ్బారెడ్డి మైకు

-గడ్డంతాండ గుడికి...టిడిపి నేత చందమూరి సుబ్బారెడ్డి విరాళం

గోరంట్ల, జూలై 13 ప్రభాతవార్త



మైకుసెట్‌కు నగదును అందజేస్తున్న దాత సుబ్బారెడ్డి

గోరంట్ల మండలంలోని గడ్డం తాండ పంచాయతీ పరిధిలో గల గడ్డం తాండ మారెమ్మ గుడికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద మూరి సుబ్బారెడ్డి మైకుసెట్‌కు విరాళం ఇచ్చి తన దైవభక్తిని సొంతం పంచా యతీ ప్రజలపై ఉన్న మమ కారాన్ని చాటుకున్నారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు పి4 సాయంలో భాగంగా సోమవారం గ్రామ పెద్దలు పంచాయతీ అధ్యక్షులు గోవిందనాయక్, ఉపాధ్యక్షులు లక్ష్మీరాంనా యక్, పాండురంగనాయక్, బూత్ కో కన్వీనర్ లక్ష్మీరాంనాయక్‌లకు నూతన మైకుసెట్‌ను సుబ్బారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## శాస్త్రీయ నృత్య కళాకారిణి కృతికకు ఘన సన్మానం

-కృతిక ప్రతిభను కొనియాడిన స్థానిక ప్రజలు



రాకెట్ల గ్రామంలో నాట్య కళాకారిణి కృతికను సన్మానించిన దృశ్యం

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

శాస్త్రీయ నృత్య కళాకారిణి, అమెరికాకు చెందిన నూతనపాటి కృతికను మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో సోమవారం పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ ముత్తలూరు అశోకకుమార్ దంపతులు గ్రామస్థులతో కలిసి ఘనంగా సన్మానించారు. రొద్దం మండలం చిన్నమంతూరుకు చెందిన నూతనపాటి సురేంద్ర, జ్యోతి దంపుతులు పదుల సంవత్సరాల క్రితమే అమెరికా దేశానికి వెళ్లి అక్కడే స్థిరపడిపోగా వారి కుమార్తె అయిన కృతిక భారతీయ శాస్త్రీయ నృత్యాలపట్ల మక్కువతో అమెరికాలోనే శాస్త్రీయ నృత్యంలో 10 సంవత్సరాలపాటు శిక్షణ పొందింది. ఈక్రమంలోనే ఈనెల 5వ తేదీన కర్నాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర కన్నడ భవన్‌లో భరతనాట్య నృత్యంలో అరంగేట్రం ప్రదర్శన ఇచ్చి అందరి మన్ననలు పొందింది. కృతిక తల్లిదండ్రులు సురేంద్ర, జ్యోతిలతో కలిసి సోమవారం రాకెట్లలోని తన మేనమామ ముత్తలూరు అశోక్‌కుమార్ ఇంటికి రాగా కృతికతోపాటు వారి తల్లిదండ్రులను వారు శాలువాకప్పి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కృతిక శాస్త్రీయ నృత్యంలో దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కృతిక ప్రస్తుతం అమెరికాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు డి.శివమ్మ, ఎం.పెన్నయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు రామిరెడ్డి, సురేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బెలుగుప్ప రామేశ్వరస్వామి దేవాలయంలో శివలింగంకు ప్రత్యేక పూజలు

బెలుగుప్ప జూలై 13ప్రభాత వార్త



బెలుగుప్ప గ్రామంలో రామేశ్వర దేవాలయములో శివలింగానికి ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహించారు. అర్చకులు సోమవారం రోజున ఆరుద్ర నక్షత్రం మాసశివరాత్రి 50 సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే అరుదైన రోజు కావడంతో ఉదయాన్నే శివలింగానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు బెలుగుప్ప గ్రామంలో పరిసర ప్రాంతాలలో వర్షాలు కురిసి ప్రజలందరూ



సుఖ సంతోషాలతో ఉండాలని సంకల్పిస్తున్నారు సాయంకాలం ఆరుద్ర నక్షత్ర ప్రదోష నాలుగు పదహైదు నిమిషాల నుండి రామేశ్వర దేవాలయంలో స్వామివారికి రుద్రాభిషేకం చేయించారు 121 నీటి బిందులతో మహా శివలింగంపై నీళ్లుపోసి అభిషేకం చేశారు. రాత్రి 8 గంటలకు భక్తులతో భజనకార్యక్రమాలు నిర్వహించారు.

## పెయ్యాల ఫ్యామిలీ "లక్ష" సాయం

-ఆలయ కమిటీ సభ్యులకు నగదు

అందజేసిన....మాజీ సర్పంచు పెయ్యాల శివారెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న దాత శివారెడ్డి

గోరంట్ల, జూలై 13 ప్రభాతవార్త

మండలంలోని పాలసముద్రం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారవేత్త నార్సింపల్లి పెయ్యాల శివారెడ్డి తన వంతు బాధ్యతగా లక్ష రూపాయల విరాళం అందజేసి తనకు ఉన్న దైవభక్తిని, సమాజ సేవను చాటుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పెయ్యాల రామలింగారెడ్డి ఫ్యామిలీ తరఫున పెయ్యాల శివారెడ్డి పాలసముద్రంలో నిర్మాణంలోఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెయ్యాల రామలింగారెడ్డి కుటుంబసభ్యులు ఆలయ నిర్మాణానికి ఇస్తున్న చేయూత మరువలేనిదని ఆకుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ వుండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ధ్యానలింగేశ్వర ఆలయంలో మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు

పెనుకొండ జులై 13 ప్రభాతవార్త



శ్రీధ్యానలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు

మండల పరిధిలోనీ కొండంపల్లి గ్రామ సమీపంలో కొండలవద్ద వెలసిన శ్రీధ్యానలింగేశ్వర ఆలయంలో సోమవారం మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సోమవారం మాస శివరాత్రి కృష్ణ చతుర్దశి మహా శైవాక్య యోగం రోజు 100సంవత్సరములకు ఒకసారి వచ్చే రోజైన సందర్భంగా పరమశివున్ని భక్తశ్రద్ధలతో పూజించారు. శివుని కృపతో ప్రజలకు ఆయురారోగ్యాలు, శాంతి, కలగాలని ప్రార్థించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు శివారాధన ఆధ్యాత్మిక శక్తి, మనోధైర్యాన్ని ప్రసాదిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప్పర కార్పోరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, పెనుకొండ అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, ఆదినారాయణ స్వామి, వడ్డి శ్రీరాములు, కొండంపల్లి గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేశారు.

## మాజీ ఎంపీ తలారి రంగయ్యకు ప్రాణహాని..

వెంటనే 2+2 గన్‌మెన్‌లు కేటాయించాలి

డీఎస్పీకి వైఎస్సార్‌సీపీ వినతి..

అధికార పార్టీపై తీవ్ర విమర్శలు



కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడగట్ట నారాయణ, పార్టీ నాయకులు.

కళ్యాణదుర్గం, జూలై 13 ప్రభాతవార్త:

అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు, కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్యకు ప్రాణహాని ఉందని, ఆయనకు తక్షణమే 2+2 గన్‌మెన్ భద్రత కల్పించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడగట్ట నారాయణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దొడగట్ట నారాయణ మీడియాతో మాట్లాడుతూ, తలారి రంగయ్య నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకుడని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ప్రజల తరఫున పోరాడుతున్న నాయకుడికి తగిన రక్షణ కల్పించడం ప్రభుత్వంతో పాటు పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. ఇటీవల కళ్యాణదుర్గం కేంద్రంగా వెలుగుచూసిన నకిలీ స్టాంపుల వ్యవహారంలో సుమారు రూ.2,500 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, పోలీసులు దర్యాప్తును సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లలేదని విమర్శించారు. ఈ కేసులో న్యాయం కోసం తలారి రంగయ్య హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, అధికార పార్టీ అండదండలతో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతి మద్యం సీసాపై పేదల నుంచి అదనపు వసూళ్లు జరుగుతున్నాయని, దీనిపై తలారి రంగయ్య నిరంతరం గళమెత్తుతూ బ్లాక్ షర్ట్ ఉద్యమం చేపట్టారని చెప్పారు. ఇలాంటి ప్రజా పోరాటాలను అడ్డుకునే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని, తలారి రంగయ్యకు ప్రాణహాని ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వెంటనే 2+2 గన్‌మెన్ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని అన్ని మండల పోలీస్ స్టేషన్లలో బెల్ట్ షాపుల నిర్వహణపై వైఎస్సార్‌సీపీ తరఫున ఫిర్యాదులు కూడా చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ఎంపీపీలు, మండల కన్వీనర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారం బిఎల్ఓ అందజేయండి మీఓటుహక్కును కాపాడుకోండి

టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముసుగుశ్రీనివాసులు



బి ఎల్ ఓ లతో కలసి సమగ్ర సర్వేలో పాల్గొన్న శ్రీనివాసులు

తాడిమర్రి జూలై 13 (ప్రభాతవార్త)

ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు సమగ్ర సర్వే ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని రేపటి మీ హక్కును కాపాడుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ముసుగు శ్రీనివాసులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో బిఎల్ఓ లతో కలిసిఓటర్ సమగ్ర సర్వే కార్యక్రమంలో పాల్గొని ఓటర్లకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ సమగ్ర సర్వే కార్యక్రమానికినేటితో గడువు ముగియనుండడం వల్ల ప్రతి ఒక్కరు ఎస్ ఐ ఆర్ పారాన్ని సరైన ధ్రువపత్రాలతో నింపి బిఎల్ఓ లకు సమర్పించి ఓటరు గా తమ హక్కును పొందాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు నూతనంగా తమ ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు పోట్ల మర్రి ఈశ్వర్ తేజతోపాటు బిఎల్ఓ ,బిఎల్ఏలు పాల్గొన్నారు.

## విలేకరి నగేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

- వైఎస్ఆర్‌సిపి మండల పబ్లిక్ వింగ్ అధ్యక్షులు దాసరి వెంకటరమణ

శింగనమల, జులై 13 ప్రభాతవార్త

గుండె పోటుతో మరణించిన విలేకరి నగేష్ కుటుంబాన్ని సోమవారం వైఎస్ఆర్‌సిపిమండల పబ్లిక్‌వింగ్ అధ్యక్షులు దాసరివెంకటరమణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈసందర్భంగా దాసరి వెంకటరమణ మాట్లాడుతూ.. నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి డాసాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు మృతుడు ఆంధ్రప్రదేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి వైఎస్ఆర్‌సిపి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు జల్లి శ్రీనివాసులు, నవీన్‌కుమార్, బెస్త గోపాళ్, బండి శ్రీనివాసులు, శరత్‌రెడ్డి, ఆదినారాయణ, చెన్నారెడ్డి, మహ్మద్‌రఫి, మునీంధ్ర పాల్గొన్నారు.

## వర్షం కోసం గాడిదలకు వివాహం



గాడిదలను ఊరేగిస్తున్న రజకులు, గ్రామస్తులు

వజ్రకరూరు జూలై 13 ప్రభాతవార్త

వర్షాభావ పరిస్థితులలో వర్షం కురిసి పంటలు పండా లని రజక సంఘం ఆధ్వర్యం లో గ్రామస్తుల సహకారంతో సోమవారం మండల కేంద్రం లో గాడిదలకు వివాహం జరి పించి ఊరేగించారు. ప్రసు_తం ఎలినినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటి వరకు చాలామంది రైతులు విత్తనాలను కూడా పొలాల్లో వేసుకోలేదు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కరువు ఏర్పడే పరిస్థితి ఉన్నందున పాత సాంప్రదాయ ఆచారాలను కొనసాగిస్తూ వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గాడిదలకు వివాహం జరిపించారు. అనంతరం బొడ్రాయి వద్ద నుండి డబ్బులు మోగిస్తూ గ్రామంలో ఊరేగించారు.

## 2,02,491 మంది ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ పూర్తి

- ఈఆర్‌వో, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి



ఈఆర్‌వో వి.మల్లికార్జునరెడ్డి

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

ఉరవకొండ-149 అసెంబ్లీ నియోజక వర్గంలో ఇప్పటివరకు 2,02,491 మంది ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల ను సేకరించి బీఎల్‌వో యాప్‌లో డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిం దని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేఖరు లతో మాట్లాడారు. నియోజకవర్గం లోని 2,26,187 మంది ఓటర్లకుగా ను అందరికీ ఎన్యుమరేషన్ ఫారాలు జారీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ కలెక్టబుల్ ఈఎఫ్‌లు, డెత్‌లు, డబుల్ ఓటర్లు 17,583 ఉన్నారని వారి వివరాలను కూడా బీఎల్‌వో యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. సర్-2026 ఇంటింటి సర్వే ప్రక్రియ రేపటితో ముగియనుందని చివరిరోజు కూడా బీఎల్‌వోలకు బీఎల్‌ఏలు సహకారం అందించాలని కోరారు. ఈనెల 21వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలవుతుందని అందులో పేర్లు లేని వారి నుండి దరఖాస్తులు స్వీకరించి సెప్టెంబర్ 22న ప్రచురించే తుది ఓటరు జాబితాలో నమోదు చేయడం జరుగుతుందని ఈఆర్‌వో వి.మల్లికార్జునరెడ్డి వివరించారు.

## ప్రతిభ కనబర్చిన ఇంటర్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

-ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఔదార్యం



విద్యార్థికు నగదు ప్రోత్సాహం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ, జూలై 13 ప్రభాతవార్త

పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ జూనియర్, బాలికల జూనియర్ కళాశాల్లో ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జూనియర్ కళాశాలలో 1987-89 ఎంపీసీ, బైపీసీ చదివిన పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలు అందించారు. స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎస్.కె.ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ క్లాస్ ఫస్ట్ ఎస్.జ్ఞానేశ్వర్ (982), సెకెండ్ ఎస్.వెంకట నాగ తేజల్ (929), బైపీసీలో క్లాస్ ఫస్ట్ కె.ఫరీద్ అలీ (873), సెకెండ్ బి.లోకేష్ (812), బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ క్లాస్ ఫస్ట్ కె.ఉమాదేవి (946), సెకెండ్ కె.ఉమ్మి హఫ్సా (935), బైపీసీ క్లాస్ ఫస్ట్ ఎం.కావ్య (900), సెకెండ్ కె.అమృత (897)లకు ఒక్కొక్కరికి 5,000, 2,500 రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. బాగా చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎం.క్రిష్ణమూర్తి, వి.హెచ్.బి.షాషావలి, పూర్వ విద్యార్థులు సాకే భాస్కర్, శశికళాదేవి, సుమతి,



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

భారతి, ప్రమీల, విజయ్‌కుమార్, వెంకట్, భీమలింగ, రామాం జినేయులు, రమేష్, చంద్రమోహన్, కృష్ణమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాప్టో ఉద్యమాన్ని విజయవంతం చేయండి

వైయస్‌ఆర్ టి ఏ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వైయస్సార్ టి ఏ నాయకులు

పుట్టపర్తి, జులై 13, ప్రభాతవార్త

ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం జూలై 14న సత్యసాయి జిల్లా కేంద్రంనందు ఉదయం 10 గంటలకు పుట్టపర్తి గణేష్ సర్కిల్ నుండి నిర్వహిస్తున్న "ర్యాలీ పికెటింగ్" కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైఎస్ఆర్ టి ఏ సంఘం నాయకులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు పి.వి రమణారెడ్డి, బడా హరిప్రసాద్ రెడ్డి లు పిలుపు నిచ్చారు. టెట్ సమస్య, 12వ పిఆర్సి కమిషన్ నియామకం, 30 మధ్యంతర భృతి, సిపిఎస్ రద్దు, ఓ పి ఎస్ సాధన, పెండింగ్ డిఏ ల ప్రకటన, దీర్ఘకాలిక బకాయిల సాధన, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ఎప్పుడో అప్లై చేసుకొని ఇన్కమ్ టాక్స్ కూడా చెల్లించిన సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులు, పాఠశాల స్థాయిలో బోధనేతర పనుల రద్దు తదితర 18 రకాల డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రాణాయామంతో ప్రశాంతత.. విద్యార్థులకు : డా. బాస్కర్ నాయుడు సూచన

ఒత్తిడిని జయించి చదువులో రాణించాలంటే ప్రాణాయామమే మార్గం

విద్యార్థి దశలో మానసిక వికాసానికి ప్రాణాయామం ఎంతో అవసరం

ధర్మవరంటౌన్, జూలై 13 ప్రభాతవార్త



జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను ఉద్దేశించి ప్రాణాయామం ప్రాముఖ్యతను వివరిస్తున్న పర్యావరణ వేత్త డాక్టర్ బాస్కర్ నాయుడు

విద్యార్థి దశలో మానసిక వికాసం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడానికి ప్రాణాయామం ఎంతో ఉపయోగపడుతుందని పర్యావరణ వేత్త డాక్టర్ బాస్కర్ నాయుడు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుమన అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చదువులో రాణించేందుకు ఐక్యూ డెవలప్‌మెంట్‌తో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా సమానంగా అవసరమని తెలిపారు. రోజువారీ జీవితంలో ప్రాణాయామాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రాణాయామం వల్ల మెదడుకు ఆక్సిజన్ సరఫరా మెరుగై జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని వివరించారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో కలిగే భయం, ఆందోళన, ఒత్తిడిని తగ్గించడంలో ప్రాణాయామం సంజీవనిలా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొంత సమయం ప్రాణాయామానికి కేటాయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీడీలు స్వరూప, సరళ, జూడో కోచ్ ఇనాయత్ బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన అధ్యాపకుల చేరిక

అధ్యాపకుల రాకతో కళాశాలకు నూతన శోభ

పదోన్నతులు, బదిలీలతో పోస్టుల భర్తీ పూర్తి

విద్యార్థులకు మెరుగైన బోధనకు మార్గం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త అధ్యాపకుల బాధ్యతల స్వీకారం

నూతన అధ్యాపకులకు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి స్వాగతం

ధర్మవరంటౌన్, జూలై 13 ప్రభాతవార్త



పదోన్నతులు, బదిలీలపై విధుల్లో చేరిన నూతన అధ్యాపకులను ఆహ్వానిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి

పట్టణంలోని కేపాహ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదోన్నతులు, శాఖాపరమైన బదిలీల ద్వారా నూతన అధ్యాపకులు సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతులపై జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్న గంగరాజు (తెలుగు), సుప్రియా (చరిత్ర), రామకృష్ణారెడ్డి (రాజనీతిశాస్త్రం), హారతి (వాణిజ్యశాస్త్రం), వనిత (రసాయనశాస్త్రం), సునీత (కామర్స్) కళాశాలలో చేరారు. అదేవిధంగా శాఖాపరమైన బదిలీల ద్వారా హరికృష్ణ (ఆంగ్లం), హరిప్రసాద్ (హిందీ), మహేంద్రరావు (లైబ్రేరియన్), శివశంకర్ (ఆర్థికశాస్త్రం), ఆదినారాయణ (కామర్స్) విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి నూతన అధ్యాపకులకు స్వాగతం పలుకుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అధ్యాపకుల రాకతో కళాశాలలో బోధన మరింత బలోపేతం కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

పీఆర్సీ, డీఏలు, సీపీఎస్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ఉద్యోగ-ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం : సానే రవీంద్రరెడ్డి

జూలై 14 ఫ్యాప్టో ఉద్యమాన్ని విజయవంతం చేయండి

18 డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయుల ఐక్యపోరాటం

టెట్ వేధింపులు ఆపాలి... పీఆర్సీ అమలు చేయాలి

ఉపాధ్యాయుల హక్కుల కోసం ఫ్యాప్టో ఉద్యమం

పీఆర్సీతో పాటు పెండింగ్ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి

పుట్టపర్తిలో ఫ్యాప్టో ర్యాలీ-పికెటింగ్‌కు భారీగా తరలిరండి సానే రవీంద్రరెడ్డి పిలుపు



ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి,పాల్గొన్న ఉపాధ్యాయులు

ధర్మవరం టౌన్, జూలై 13 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని ఏపీటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ధర్మవరం పట్టణ ఏపీటీఎఫ్ శాఖ అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి అంజినాయక్, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీ, పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు, దీర్ఘకాలిక ఆర్థిక బకాయిల చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అదేవిధంగా టెట్ పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేయడం సరికాదని అన్నారు. ఏపీటీఎఫ్ సీనియర్ నాయకుడు ఎన్. శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సీపీఎస్ బకాయిలను వెంటనే వారి పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, హిందీ, పీడీ ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (సీతిశిగివీ) ఆధ్వర్యంలో జూలై 14న పుట్టపర్తి జిల్లా కేంద్రంలో ఉదయం 10 గంటలకు గణేష్ సర్కిల్ నుంచి నిర్వహించే ర్యాలీ-పికెటింగ్ కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సానే రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు.ఫ్యాప్టో ఉద్యమం ద్వారా టెట్ సమస్య పరిష్కారం, 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించడం, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, పెండింగ్ డీఏల విడుదల, దీర్ఘకాలిక బకాయిల చెల్లింపు, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపు, పాఠశాల స్థాయిలో బోధనేతర పనుల రద్దు తదితర 18 డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యాయులు రమేష్, జగదీష్, శేఖర్, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, వెంకటరంగయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న తహసిల్దార్ జయశ్రీ

వజ్రకరూరు జూలై 13 ప్రభాతవార్త

ఎస్ ఐ ఆర్ సర్వే లో భాగంగా ఏన్యూమర్ ఫారాలను స్వీకరించే గడువు ఒక్క రోజుతో ముగియనుందని రాజకీయ పార్టీల బిఎల్ఏలు బి ఎల్ వో లకు సహకరించి త్వరితగతన సర్వేను పూర్తిచేయాలని నాయకులను ఆమె కోరారు. మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ఆమె అధ్యక్షతన రాజకీయ పార్టీల బి ఎల్ ఏ లతో సమావేశాన్ని నిర్వహించారు. మండలం లో మొత్తం 51 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. అందులో మొత్తం 43920 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారందరికీ ఏన్యూమర్ ఫారాలను అందించామన్నారు. అందులో 38,489 మంది బిఎల్వోలుకు అందించారన్నారు. 2 700 లకు పైగా అన్ కలెక్టెడ్ (మరణించిన శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, డబుల్ ఓటర్లు) ఉన్నారన్నారు. బి ఎల్ ఏలు పూర్తి సహకరించి 100 ఎస్ఐఆర్ సర్వేను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నాగేంద్ర, నాయకులు మాజీ సర్పంచ్ దస్తగిరి, రాధా చౌదరి, గురు, వడ్డే శ్రీరాములు, మాజీ ఎంపిటిసి బెస్త నాగన్న, వైసిపి నాయకులు రాకెట్ల బాబు, హబీబ్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో హుండీ చోరీ




హుండీని ఎత్తుకెళుతున్న యువకులు

వజ్రకరూరు జూలై 13 ప్రభాతవార్త

మండలంలోని కొనకొండ్ల గ్రామ శివారులో ఉరవకొండ గుంతకల్ ప్రధాన రహదారిలో ఉన్న బండయ్య భావి ఆంజనేయ స్వామి ఆలయంలో ఇద్దరు యువకులు స్వామివారి హుండీని ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు ఆలయంలోని సిసి టీవీలో రికార్డ్ అయ్యాయి. దీనిని గమనించిన ఆలయ అర్చకులు నాగయ్య సోమవారం వజ్రకరూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రధాన రహదారిలో ఉన్న ఆలయంలోచోరీ జరగడంతో స్థానికులు ఆందోళనకు గురి అవుతున్నారు. ఈనెల 9న గుళ్యపాళ్యం గ్రామ శివారులో బైక్ పై వెళుతున్న మహిళా మెడలో గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన మరువక ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనకు లోన వుతున్నారు.

## నేడు అన్ని రాజకీయపార్టీల బీఎల్‌ఎలతో సమావేశం

బత్తలపల్లి, జూలై 13 ప్రభాతవార్త

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ చివర దశకు చేరుకున్న నేపథ్యంలో మంగళవారం మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత అన్ని రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఈశ్వర్ ప్రసాద్, ఎంపీడీఓ నరసింహనాయుడు పేర్కొన్నారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ జాతీయ ప్రాంతీయ రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందరూ తప్పక హాజరు కావాలని వారు కోరారు.

## భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



ప్రత్యేక ఆలంకరణలో బత్తలపల్లిలోని ఓంకారేశ్వరుడు

బత్తలపల్లి, జూలై 13 ప్రభాతవార్త

మండలంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడా యి. ఆరుద్ర నక్షత్రం, మాసశివరాత్రి, సోమవారం ఇలా మూడు ఒకే రోజు రావడంతో భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలా ఎన్నో ఎండ్లకు ఒక్కసారి వస్తుందని అర్చకులు తెలిపారు. దీంతో ఈ రోజు ప్రత్యేకమైనదిగా భావించి భక్తులు పూజల్లో పాల్గొన్నా రు. మండలంలోని ప్రముఖ శివాల యాలు దంపెట్ల చెన్నకేశవాలయం. డి. చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, బత్తలపల్లి శివాలయం, ఈదుల ముష్టూరు, పోట్లమర్రి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే ఆయా ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

## వందేళ్లకోసారి వచ్చే మహా వైవాక్షయోగం



శంకరేశ్వరున్ని అలంకరించిన దృశ్యం

అగళి, జూలై 13 ప్రభాతవార్త

వందేళ్ల కోసారి వచ్చే మహా శైవాక్షయోగం రోజును పురస్కరించుకని శంకరేశ్వర స్వామిని అభిషేకాలతో, వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు వేకువ జామునే స్నానమాచరించి శంకరేశ్వర స్వామి ఆలయానికి భక్తి పూజలు చేశారు. రుద్రాభిషేకం, దీపాలను వెలిగించడం, శివుని పూజలో పాల్గొనడం, ఈ రోజు చాలా మంచిదని శాస్త్రాలు చెబుతున్నాయి. వంద శివరాత్రులకు చేస్తే వచ్చే పుణ్యం ఈరోజే వస్తుందని, అందుకే శైవ క్షేత్రాల్లో విశేషంగా భక్తులు శివుని పూజల్లో పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి, జూలై 13 ప్రభాతవార్త



ఆంజనేయులు (ఫైల్‌ఫోటో)

కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న ఆంజనేయులు (42) అనే వ్యక్తి సోమవారం జిల్లా కేంద్రంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుత్తి మండలం మామదూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు వ్యక్తిగత కారణాలవల్ల కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. ఈ నెల 10న తన పొలంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేద్దాం : సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్



బత్తలపల్లిలో గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య

బత్తలపల్లి, జూలై 13 ప్రభాతవార్త

లేపాక్షిలో ఆర్ హెచ్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజులు పాటు జరిగే జిల్లా సైద్దాంతికతక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూఖి భూమి కోసం భక్తి కోసం ఎందరో వీరుల ప్రాణత్యాగం వలన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలను పూర్తి చేసుకున్నదని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ధరల నియంత్రణ. నల్లధనం వెలికితీత, జనధన్ ఖాతాలు ఉన్నవారి ఖాతాలలో రూ.15లక్షలు డబ్బు జమ చేస్తామని దేశ ప్రజలను ప్రధాని మోదీ మోసం చేశారన్నారు. శ్రమజీవుల స్వేదంతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెట్టడమే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాను కారుచౌకగా కట్టపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకానికి విబిజీ రాంజీ పేరు చేర్చడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ సూపర్‌సిక్స్ పథకాలలో చెప్పిన విధంగా పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.4లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా శక్తి పేర మహిళలకు నెలకు రూ. 1500లు జమ చేస్తామన్న హామీ ఏమైందని, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్, స్కాలర్షిప్ ఆటకెక్కించడం సరికాదని హితవు పలికారు. టిడ్కో ఇండ్లను వెంటనే పూర్తి చేసి లబ్దిదారులకు అందజేయాలని కోరారు. కరువు, వలసలు, ఆత్మహత్యల నిర్మూలన కోసం శాశ్వత పరిష్కారాలు చూపాలని కోరారు. అనంతరం శిక్షణా తరగతులకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చేతి వృత్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి, నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు. చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం కుళ్లాయప్ప, ధర్మవరం పట్టణ సహాయ కార్యదర్శి రమణ, తాడిమర్రి మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా సమైక్య నాయకురాలు రమిజా, లలితమ్మ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు కేబుల్ దొంగల అరెస్టు...

400 మీటర్ల కేబుల్ వైరు, రెండు స్టార్టర్లు స్వాధీనం




కేబుల్ దొంగలను అరెస్టు చేసిన దృశ్యం

అగళి, జులై 13 ప్రభాతవార్త

పుట్టపర్తి జిల్లా ఆదేశాల మేరకు, మడకశిర రూరల్ ది గారి నేతృత్వములో అగలి సిఐ బి.రంగడు యాదవ్ వారి సిబ్బంది సహాయముతో ఇద్దరు కేబుల్ దొంగలను అరెస్టు వారి నుండి 400 మీటర్ల కేబుల్ వైరు, రెండు స్టార్టర్లు స్వాధీనం చేసుకున్నారు. అగళి మండలం, కదిరేపల్లి, ఇరిగేపల్లి గొల్ల హట్టి, అగళి గ్రామంలో రాత్రి పూట కేబుల వైరు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు..కర్నాటక రాష్ట్రం, శిర తాలూకా, మూగనహళ్లి గ్రామానికి చెందిన సురేష, అగళి మండలం, కదిరేపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తిలను సోమవారం అగళి సిఐ బి.రంగడు యాదవ్ వారి సిబ్బందితో కలిసి అగళి మండలం, ఇరిగేపల్లి గ్రామం శివారులో ఉన్న మైరాడ ప్లాన్ సంస్థ యొక్క పాడుబడిన బిల్డింగ్ వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుండి 400 మీటర్ల కేబుల్ వైరు, రెండు స్టార్టర్ లు స్వాదినం చేసుకోవడం జరిగిందని ఎస్సై తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1,000,00/ ఉంటుందన్నారు ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ బాలాజీ కానిస్టేబుల్స్ నాగరాజు రాజన్న తదితరులు ఉన్నారు.

## మంచి నీటి ప్లాంట్‌ను, అంగన్వాడి కేంద్రాన్ని ఇవ్వండి



మంచి నీటి ప్లాంట్‌ను, అంగన్వాడి కేంద్రాన్ని ఇవ్వండి

అగళి, జులై 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అగళి ఎస్సీ కాలనీలో మంచి నీటి ప్లాంట్‌ను మంజూరు చేయాలని, కాలనీ వాసులు ఆర్డిటి ఏటిఎల్ ఓబుళేసుకు విన్నవించుకున్నారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనాన్ని మంజూరు చేయాలని విన్నవించుకోగ ఏటిఎల్ ఓబుళేసు తమ అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, ఏటిఎల్ ఓబుళేసు, పంచాయితీ కార్యదర్శి రంగనాథ్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఊరు జనానికి వైద్య సేవల్లో...శ్రీకాంత్‌యాదవ్

- నిమ్మల శ్రీధర్ పర్యవేక్షణలో వైద్యశిబిరం
- తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే... సింగిరెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన
- హాజరైన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, ఉమాశంకర్



వైద్య శిబిరానికి హాజరైన కూటమి నాయకులు

గోరంట్ల, జూలై 13 ప్రభాతవార్త

రాజకీయమంటే పదవులు సంపాదనే కాదు ప్రజాసేవ కూడా ముఖ్యమేనని భావించిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్‌యాదవ్ తన సొంత ఊరు ప్రజల కోసం తనవంతుగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉపయోగపడ్డాడు. మండలంలోని సింగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి శ్రీకాంత్‌యాదవ్ పిలుపుమేరకు నాయకులు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచు ఉత్తమరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు రవిమోహన్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మినారాయణ, పులేరు మఠం శ్రీనివాసులు, ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉమాశంకర్, నరేష్‌యాదవ్, అజంతుల్లా హాజరై కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాజకీయం అంటే ప్రజలకు సేవ చేయడమని భావించిన యువ నాయకుడు శ్రీకాంత్‌యాదవ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీపతి, కురుబ మహేంద్ర, మల్లాపల్లి నవీన్, సింగిరెడ్డిపల్లి శేఖర్, నరసురం, ప్రభాకర, సిద్ధప్ప, వాల్మీకి వెంకటేష్, వెంకటాచలం, సుభహన్, దాదు, మల్లికార్జున, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

